క్లుప్తంగా

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సఖీ సెంటర్ సభ్యులు

రుద్రంగి: బాలికలు తమపై జరిగే అకృత్యాలను, మోసాలను అరికట్టేందుకు ప్రమత్తంగా ఉండాలని సఖీ సెంటర్ కౌన్సిలర్ కళావతి సూచించారు. సోమవారం రుద్రంగి జెడ్పీ హైస్కూల్, కేజీబీవీలలో సఖీ సెంటర్ ఆధ్వర్యంలో సఖీ సేవలు, జెండర్ వివక్షత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ప్రేమ, ఆకర్షణలకు గల తేడాలు, పోక్సో చట్టం, విపత్తు సమయంలో సంప్రదించాల్సిన టోల్‌ఫ్రీ నెంబర్లు, మొబైల్ వాడటం వలన కలుగు నష్టాలు, సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేయడం వలన కలుగే సైబర్ నష్టాలు, బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన సమస్యలు, నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అంబటి శంకర్, కేజీబీవీ ఎస్‌వో వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీవో

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి మైనార్టీ, దివ్యాంగుల రుణాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగుల కోటాలో ఒక్క యూనిట్‌కు 24 మంది దరఖాస్తు చేసుకోగా 18 మంది, మైనార్టీ కోటాలో రెండు యూనిట్లకు 55 మంది దరఖాస్తు చేసుకోగా 42 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న రాణీప్రసాద్

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి బూర మధుసూదన్‌చే రూపొందించబడిన శుభకృత్ నామ ఉగాది పంచాంగాన్ని సోమవారం ప్రసిద్ధ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ఆవిష్కరించారు. నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభం చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మపీఠం ఎడిటర్ కొక్కుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో జోగినపల్లి



జోగినపల్లి దంపతులను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్నను సీఎం కేసీఆర్ తోడల్లుడు కొదురుపాకకు చెందిన జోగినపల్లి రవీందర్‌రావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

పరిహారం.. పరిహాసం

- రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులు
- కూల్చుకోవడానికి రూ.లక్ష ఖర్చు
- డబుల్ బెడ్రూం ఇళ్ల జాడలేదు
- గొల్లపల్లిలో 18 ఇళ్లు కూల్చివేత
- పరిహారం అందించాలని బాధితుల వేడుకోలు



గొల్లపల్లిలో కూల్చివేసిన ఇల్లు

ఎల్లారెడ్డిపేట: "ఇంత అన్యాయం ఎక్కడా చూడం. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారికి డబ్బులు, డబుల్‌ఇళ్లు ఆశచూపి, పని అయిన తరువాత పట్టించుకోవడం మానేశారు.'' ఇది ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన బాధితుల ఆవేదన. ప్రభుత్వం, గ్రామపంచాయతీ నుంచి పరిహారం అందక రెంటికి చెడ్డ రేవడి అయ్యారు. ఉన్న నీడను కోల్పోయి రోడ్డున పడ్డామని, తమను ఆదుకోవాలని పలుసార్లు ప్రజావాణి, మండల సభల్లో విన్నవించిన పట్టించుకున్న వారు కరువయ్యారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని, స్థలం ఉంటే సొంతంగా ఇళ్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా బాధితులు పడుతున్న బాధలు అంతా ఇంతకాదు.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో గత ఏడాది రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని రంగు రాములు ఇంటి నుంచి రాజన్నపేటకు వెళ్లే దారిలోని మూలమలుపు వరకు 18 ఇళ్లు కూల్చివేయాలని గ్రామ పంచాయతీ తీర్మానించింది. ఆ తీర్మానం ప్రకారం కూల్చి వేసే ఇళ్లకు మార్కింగ్ చేశారు. దీంతో ఇంటి యాజమానులే ముందుకు వచ్చి మార్కింగ్ ప్రకారం ఇళ్లను తొలగించుకున్నారు. ఇళ్లను కూల్చివేయడానికి రూ.లక్ష వరకు ఒక్కొక్కరికి ఖర్చు వచ్చింది. కూల్చివేత ఖర్చులే కాకుండా పరిహారం అందక పరేషాన్ అవుతున్నారు.

డబుల్ బెడ్రూంలు దక్కలేదు

రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాలేదు. సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆచరణకు మాత్రం నోచుకోలేదు. స్థలం ఉన్న వారు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ, ఎలాంటి డబ్బులు మంజూరు కాలేదు. కొంతమంది సగం ఇళ్లు కోల్పోయిన వారు వారే ఖర్చు పెట్టుకోని ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. అటు కూల్చివేసుకోవడానికి, ఇటు కట్టుకోవడానికి అప్పులు చేయాల్సివచ్చిందని బాధితులు గోడువెళ్లబోసుకున్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి.

18 మంది రోడ్డున పడ్డారు..

ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు. అప్పుడు కూల్చివేతల సమయంలో అధికారులు వచ్చి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 18 మంది ఇళ్లు కోల్పోయి రోడ్డున పడితే పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. ఇందులో కొంతమంది వేరే చోట ఇళ్లు కట్టుకోవడానికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతులిచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపిస్తున్నారు. నిలువ నీడలేక అనేక మంది నెల అద్దెలు కడుతూ కిరాయి ఇళ్లలో తలదాచుకుంటున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, గ్రామ పంచాయతీ తరపున ఇళ్లు కోల్పోయిన 18 మందికి పరిహారంతో పాటు సొంత స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు, స్థలం లేని వారికి డబుల్ బెడ్రూం, ఇళ్లు కట్టుకున్న వారికి రూ.5 లక్షల చొప్పున చెల్లించాలని కోరుతున్నారు.

పరిహారం అందించాలి



రోడ్డు వెడల్పులో సగం కంటే ఎక్కువ ఇల్లు పోయింది. ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదు. మిగిలిన సగంలోనే మళ్లీ ఇంటి నిర్మాణం చేసుకున్నాం. ఇల్లు కూల్చడం మొదలుకొని తిరిగి కట్టుకోవడానికి రూ.10 లక్షల వరకు ఖర్చయ్యింది. పరిహారం అందించి ఆదుకోవాలి.

– మర్రి వెంకట్‌రెడ్డి, బాధితుడు

సాయం అందించాలి



రోడ్డు నిర్మాణంలో సగం ఇల్లు పోయింది. దీంతో మొత్తం ఇంటిని కూల్చి వేశాం. తిరిగి కట్టుకోవడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి సాయం అందించాలి. కూల్చి వేసే సమయంలో రోడ్డు రవాణా శాఖాధికారులు ఇచ్చిన హామీ మేరకు పరిహారం అందజేయాలి.

– పిట్ల శ్రీశైలం, బాధితుడు

ఉచిత అనుమతులిచ్చాం



ఇళ్లు కోల్పోయిన వారు తిరిగి నిర్మించుకోవడానికి ఉచితంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నాం. సొంత స్థలం ఉన్న వారికి డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు అందించేలా అధికారులతో మాట్లాడాం. బాధితులందరికీ న్యాయం జరుగుతుంది.

– పోశం సరోజన, సర్పంచ్

జనహితకు అధికారులు డుమ్మా

- కిందిస్థాయి ఉద్యోగులను పంపుతున్న అధికారులు
- నోటీసు ఇచ్చినా మారని తీరు



ఖాళీ కుర్చీలతో వెలవెలబోతున్న జనహిత

ముస్తాబాద్: జనం హితం కోరేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జనహితకు మండల స్థాయి అధికారులు కొందరు డుమ్మా కొడుతున్నారు. ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనహితకు ఒక్క నీటి పారుదల శాఖ ఏఈ వంశీకృష్ణ మినహా మండల స్థాయి అధికారులందరూ గైర్హాజరయ్యారు. అలాగే ఎంపీడీవో స్థానంలో జూనియర్ అసిస్టెంట్ మధు, ఐకేపీ నుంచి సీసీ శోభన్‌బాబును పంపించడం గమనార్హం. ఉదయం 11.17 గంటల వరకు కూడా ఇతరశాఖల అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. ప్రజలు కష్టాలు, సమస్యల పరిష్కారానికి ఏకైక వేదికగా భావించే జనహిత నామమాత్రంగా సాగుతుందనడానికి ఇదే నిదర్శనం. ప్రతి సోమవారం అధికారులు రావడం లేదని గుర్తించిన తహసీల్దార్ మునిందర్ ఈనెల 15న అన్ని శాఖల మండల అధికారులకు నోటీసులు పంపించారు. జనహితకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అయిన అధికారుల తీరులో మార్పు రాలేదని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆరోపిస్తున్నారు. గైర్హాజరైన అధికారులకు మరోసారి నోటీసులు అందజేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ అన్నారు. తక్షణ సమస్య పరిష్కారానికి చక్కటి వేదికగా జనహితను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

సిరిసిల్ల సెర్ప్ ఉద్యోగుల హర్షం



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్స్ ఇస్తూ జీవో నంబరు 11ను జారీ చేయడంపై జిల్లా కేంద్రంలో సెర్ప్ ఉద్యోగులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. తమ సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్స్ ఇవ్వడంపై జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు రదం చంద్రయ్య, సూదుల రాజు, జ్యోతి, రవికుమార్, డి.కృష్ణస్వామి, సుధారాణి, సుదర్శన్, రజిత, పద్మయ్య, పరశురాం, హరికృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాస్, జిల్లాలోని డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఆఫీస్ స్టాఫ్, జిల్లా సమాఖ్య పాలకవర్గ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం



సిరిసిల్లటౌన్: పరిశీలిస్తున్న జిందం కళ



ఎల్లారెడ్డిపేట: ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక

సిరిసిల్లటౌన్: స్థానిక 29వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, వైద్యారోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పిల్లి రేణుక ప్రారంబించారు. సెస్ డైరెక్టర్ వర్ష కృష్ణహరి, సర్పంచ్ పడిగెల రవీందర్, ఎంపీటీసీ వరద బాబు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామంలో సోమవారం రెండోవిడత కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ పూర్మాని మంజుల ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూతురి పద్మ, ఎంపీటీసీ ములిగె దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ ఎసిరెడ్డి రాంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దేవదాస్, జాగృతి అధ్యక్షుడు రామాగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షురాలు మోర నిర్మల, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని దుంద్రపల్లి గ్రామంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం సర్పంచ్ కందుల కరుణ ప్రారంభించారు. ఎంపీటీసీ కంకణాల వనజ, వైద్యాధికారి సౌమిని, ఉపసర్పంచ్ వంగ రవి, సూపర్‌వైజర్ శశికుమార్, వార్డు సభ్యులు మహేందర్‌రెడ్డి, నరహరి, ఏఎన్‌ఎంలు శ్యామల, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య సోమవారం ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ కాశోల్ల పద్మ, ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి గీతాంజలి, బాలకృష్ణ, దేవదాస్, దుర్గప్రసాద్, చందు, రామస్వామి, మానస, నర్సింగం పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి



ముస్తాబాద్: దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: వడగండ్ల వానతో నష్టపోయిన అన్నదాతలకు తక్షణమే పరిహరం చెల్లించి ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముస్తాబాద్, పోతుగల్, గూడెం, ఆవునూర్ గ్రామాలలో వడగండ్లతో దెబ్బతిన్న వరి పంటను సోమవారం పరిశీలించి, రైతులను పరామర్శించారు. అనంతరం తహసీల్దార్ మునిందర్‌కు రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. వెంటనే సర్వే చేసి వారం రోజుల వ్యవధిలోనే పరిహరం అందజేయాలన్నారు. పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు,ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రరాములు, ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: అకాల వడగండ్ల వానలతో రైతులకు ఆపార నష్టం జరిగిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్‌లలో వడగండ్లతో నష్టపోయిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఆకాల వర్షాలతో 40 నుంచి 60 శాతం వరకు పంట నష్టం జరిగిందన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి పగబట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రాజునాయక్, దేవానందం, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

బోయినపల్లి: మండల కేంద్రమైన బోయినపల్లిలో అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు బోయిని ఎల్లేశ్‌యాదవ్ అన్నారు. అకాల వర్షంతో గ్రామంలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, వేరుశెనగ తదితర పంటలను ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం ప్రతినిధులు బోయిని రాజు, బొజ్జ ప్రభాకర్, కన్నం రాజు, పెగ్గెర్ల శంకర్, రైతులు పాల్గొన్నారు.

పిచ్చుకలతో జీవసమతుల్యత



పిచ్చుకల బొమ్మలు గీసిన విద్యార్థులు

చందుర్తి: జీవ సమతుల్యతను కాపాడడంలో పిచ్చుకలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, వాటిని సంరక్షించే బాధ్యత అందరిపైన ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎం సంపతి రమేశ్ కోరారు. మర్రిగడ్డ ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రపంచ పిచ్చుకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిచ్చుకల ప్రాముఖ్యత అవగాహన కల్పించారు. విద్యార్థులు పక్షులపై దయ, ప్రేమ కలిగి ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు రేణుక, అఖిల పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఉగాది కవి సమ్మేళనం

సిరిసిల్లకల్చరల్: ఉగాది పర్వదినం నేపథ్యంలో జిల్లా రచయితల సంఘం సారథ్యంలో మంగళవారం కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సమ్మేళనానికి బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్, జిల్లా పౌర సంబంధాల అధికారి అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. కవులు, కవయిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నియామకం

మత్స్యశాఖ మహిళా అధ్యక్షురాలుగా స్వప్న

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిర గ్రామంలో మత్స్యశాఖ మహిళా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలుగా సుతారి స్వప్న, ఉపాధ్యక్షులుగా పని లక్ష్మి, పది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రుద్రంగి: అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని మానేసి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. సోమవారం వారు అధికారులతో కలిసి రుద్రంగి మండల కేంద్రంలోని కంపోస్టు షెడ్డు పక్కన ప్లాస్టిక్ వేస్ట్ మేనేజిమెంట్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాలోతు శంకర్, పీఆర్ఏఈ మనోహర్, ఎంపీవో సుధాకర్, కోఆప్షన్ మెంబర్ జెమీలా బేగం, రుద్రంగి ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లీకేజీ కేసులను సీబీఐకి అప్పగించాలి



ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు నీరటి బాబు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపెల్లి అంజయ్య మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో అధికార పార్టీ హస్తం ఉందని ఆరోపించారు. విచారణకు అనేక అడ్డంకులు ఉన్నాయని, ఈ కేసును సీబీఐకి అప్పగించి నిష్పాక్షపాతంగా విచారణ చేసేందుకు సీబీఐకి అప్పగించాలన్నారు. నాయకులు చిరంజీవి, కిషన్, అజిత్, రాజు, సాయిచంద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

ఇల్లంతకుంట: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని 32 మహిళా సంఘాలకు రూ.5 లక్షల పావలావడ్డీ ప్రొసిడింగ్‌లను సోమవారం అందజేసి మాట్లాడారు. సర్పంచ్ బిల్లవేని పర్శరాం, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సీఏ పద్మ, ఏఎంసి డైరెక్టర్ మల్లయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామంలో సోమవారం సర్పంచ్ నీరటి లక్ష్మి, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య ఆధ్వర్యంలో నిత్యశ్రీ రూ.60 వేలు, ఝాన్సీ 25 వేలు, లాస్య రూ.22 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

చెక్కు అందజేత

ఇల్లంతకుంట: మండల కేంద్రానికి చెందిన కందుకూరి వీరవ్వ అనే మహిళ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.25 వేలు మంజూరు కాగా బాధితురాలికి సోమవారం తెలంగాణ ఫుడ్ కమీషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అందజేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పెద్ద ఎత్తున వారికి రుణాలు అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ మహాజన సభలో ఆయన మాట్లాడారు. నాబార్డ్ సహకారంతో సంఘం పరిధిలో రైతులకు రూ.కోటితో బంగారం, వాహనాలకు రుణాలను ఇచ్చేందుకు తీర్మానించినట్లు తెలిపారు. రూ.44 లక్షలతో బ్యాంక్, సంఘం భవనాలను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలను కొరత లేకుండా అందించామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. జన సభలో వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, దొమ్మాటి నర్సయ్య, గొగూరి ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, సతీష్, సుధాకర్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సౌకర్యార్థం గోదాంల నిర్మాణం



భూమిపూజ చేస్తున్న కిషన్‌రావు

చందుర్తి: ఎరువుల బస్తాలను నిల్వ చేసేందుకు గోదాం నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కేడీసీసీ డైరెక్టర్, సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు జలగం కిషన్‌రావు తెలిపారు. మండలంలోని రామరావుపల్లె గ్రామంలో సనుగుల పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ చేశారు. గోదాం నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన స్థలదాత డాక్టర్ ముస్కు అనందరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, గ్రామ సర్పంచ్ అయిల్నేని కమలాకర్‌రావు, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

డయల్ 100పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వీర్నపల్లి: డయల్ 100పై అందరికీ అవగాహన ఉండాలని ఏఎస్సైలు రాజిరెడ్డి, కిషన్‌రావు అన్నారు. మండలం గర్జనపల్లి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైం, మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలతో ఎంతోమంది జీవితాలు అర్థాంతరంగా ముగిసినట్లు తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. వాహన కాగితాలు. హెల్మెట్, ఇన్సురెన్సు తప్పకుండా ఉండాలన్నారు.

పెంపుడు కుక్కలకు వైద్యం

వేములవాడరూరల్: కుక్కలకు ఇటీవల వింత వ్యాధి సోకడంతో వాటికి యజమానులు వైద్య పరీక్షలు అందిస్తున్నారు. కుక్కలు రోజురోజుకు చిన్నారులను కరుస్తుండడంతో పాటు వ్యాధితో ఇబ్బంది పడుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఇంటి వద్ద ఉండే పెంపుడు కుక్కలకు యజమానులు పశువైద్యశాలలకు వెళ్లి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు.